ముగిసిన ఇంటర్ పరీక్షలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15: ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. శుక్రవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ 2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 14,720 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,677 మంది హాజరయ్యారు. 1043 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్షలు నిర్వహించామన్నారు.

హంతకులను అన్నే కాపాడుతున్నాడు



"దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తోబుట్టువుల కోసం పరితపించేవారు. వారి బాగోగులు చూసుకునేవారు. మేనత్తలను కూడా కంటికి రెప్పలా వివేకానందరెడ్డి కాపాడుకునేవారు. వారిద్దరూ చెల్లెళ్ల కోసం అంత తపిస్తే మరి సొంత చిన్నాన్న హత్య కేసులో నిందితులకు అండగా ఉంటావా..." అంటూ షర్మిల, సునీత భావోద్వేగంతో ప్రశ్నించారు. హంతకులను అన్నే కాపాడుతున్నాడని.. ప్రజాకోర్టులో వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.







వివేకానందరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ సునీత, వైఎస్ షర్మిల



వివేకా స్మారకోత్సవ ఆత్మీయసభకు హాజరైన వారు

- ప్రజాకోర్టులో వారికి బుద్ధి చెప్పాలి
- జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన చెల్లెళ్లు
- వివేకా మంచి మనిషి
- అలాంటి వ్యక్తిని అంత దారుణంగా చంపుతారనుకోలేదు
- వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సన్నిహితులు
- వివేకా సంస్మరణ సభకు భారీగా తరలివచ్చిన వివేకా అభిమానులు
- వైసీపీలో కలవరం

కడప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురై ఐదేళ్లు అయింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కడపలోని జయరాజ్‌గార్డెన్‌లో శుక్రవారం ఐదవ స్మారకోత్సవ మరియు జ్ఞాపకార్థ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నేతలు మినహా వైఎస్ వివేకానందరెడ్డితో అనుబంధం ఉన్న, ఆయనతో కలిసి జర్నీ చేసిన వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకాతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తండ్రి హత్యలో నిందితులను కనిపెట్టేందుకు డాక్టర్ సునీతారెడ్డి చేసిన న్యాయ పోరాటాన్ని అభినందించారు. వివేకానందరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, డాక్టర్ సునీతా రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. ఇక ఈ సమావేశానికి వైఎస్ వివేకా అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశాన్ని వివేకా కూతురు డాక్టర్ సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వివేకాతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, ముక్తియార్, విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంటతడి పెట్టించిన ప్రసంగం

వివేకానందరెడ్డితో తన చిన్ననాటి స్మృతులను ఆయన కూతురు డాక్టర్ సునీత, తండ్రి తరువాత చిన్నాన్నతో ఉన్న అనుబంధాన్ని వైఎస్ షర్మిలారెడ్డి సభాముఖంగా గద్గగస్వరంతో చెప్పడం సభికులను కంటతడి పెట్టించింది. నాన్నకు ఎప్పుడూ పులివెందుల, కడప జిల్లాలే ముఖ్యమని తాను అమెరికాలో ఉన్నప్పుడు బలవంతంగా తీసుకెళ్లినప్పటికీ వారం పదిరోజుల్లోపే పులివెందులకు వచ్చేసేవాడని సునీత అన్నారు. "నా కొడుకు ఆరోగ్యం బాగలేనప్పుడు మాతో మూడు నెలలు ఉన్నాడు. పక్కకు పోకుండా కంటికి రెప్పలా చూసుకున్నాడు. వాడు చనిపోయినప్పుడు ఎంతో బాధపడ్డాడు. తల్లిండ్రుల కోసం అప్పుడే ఇండియాకు వచ్చేశాం. మా నాన్నకు కమ్యూనిస్టు భావాలు ఉన్నాయి. నేను 9 చదివేటప్పుడు కారల్ మార్క్స్ బుక్స్ ఇచ్చి చదవమన్నాడు. పులివెందులలో భూగర్భ డ్రైనేజీ, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంటు గురించి 1993, 1994లోనే నాతో చర్చించేవారు. 1989-90లోనే సేంద్రియ వ్యవసాయం, డ్రిప్‌పై చెప్పేవారు. పులివెందులను ఎలా అభివృద్ధి చేయాల, కడపజిల్లాలో హత్యలు, వయోలెన్స్ లేనిది చూడాలనేదే ఆయన ఉద్దేశ్యం" అన్నారు.

షర్మిల మాట్లాడుతూ.. చిన్నాన్న వివేకానందరెడ్డి మంచి మనిషి. నన్ను పెంచారు. చిన్నాన్న కోసం... ఏదైనా సమస్య వచ్చి ఎవరైనా వస్తే రాత్రిపగలు అని చూడకుండా ఉన్న వెహికల్‌లో జనాలను కిక్కిరిసి వేసుకుని.. వచ్చిన వారికి చోటు లేకున్నా సరే ఎక్కించుకుని అది కలెక్టర్ ఆఫీసా, ఆర్డీవో ఆఫీసా, ఎమ్మార్వో ఆఫీసా అని చూడకుండా ఆఫీసులకు వెళ్లి వారికి పనిచేసేవారు. చనిపోయే ముందు చిన్నాన్న నన్ను కలిశారు. షమ్మీ నువ్వు కడప ఎంపీగా పోటీ చేయాలంటూ బతిమలాడారు. అన్నీ అనుకూలిస్తే సరేలే అని చెప్పాను. అలాంటి చిన్నాన్నను దారుణంగా హత్య చేశారు." అంటూ బాధపడ్డారు.

పులివెందులలో అనుమతి నిరాకరణ

వైఎస్ వివేకా సంస్మరణ సభను తొలుత పులివెందులలో నిర్వహించాలనుకున్నారు. అందులో భాగంగా పులివెందులలో ఓ కన్వెన్షన్ హాలులో బుక్ చేసుకుని డబ్బులు కట్టారు. విషయం తెలుసుకున్న వివేకానందరెడ్డి హంతకులు అక్కడ సభకు అనుమతిస్తే మీ కథ చూస్తామని బెదిరించడంతో ఇక్కడ మీటింగ్ వద్దంటూ నిర్వాహకులు అన్నట్లు సమాచారం. చివరికి కడపలోని వివేకా సొంత కన్వెన్షన్‌లోనే స్మారక సభ నిర్వహించారు.

వివేకా కుటుంబానికి అండగా ఉందాం..



వివేకానందరెడ్డి ఎంపీగా నేను ఎమ్మెల్యేగా ఉన్నాం. వైఎస్సార్ మా కుటుంబానికి చాలా ఆప్తులు. సమీకరణాలు మారడంతో రాజకీయాలు మారాయి. నాడు చంద్రబాబునాయుడు, ఆదినారాయణరెడ్డి, బీటెక్‌రవిని అడ్డు పెట్టుకుని వివేకాను చంపారంటూ ఆరోపించారు. నేను ఆనాడే చెప్పా.. నేను తప్పు చేస్తే ఉరి తీయమని.. ఇప్పుడు కూడా అదే చెబుతున్నా. వివేకా హత్య జరిగినప్పుడు పొద్దున ఒకటి చెప్పారు, మధ్యాహ్నం తరువాత మరొకటి చెప్పారు. నన్ను సిట్ వారు రెండుగంటల పాటు ప్రశ్నలు అడిగి సతాయించారు. వివేకాను వారి కుటుంబసభ్యులు హత్యచేశారా, లేదు మేం చేశామంటే ఇక్కడే మీరు మమ్మల్ని ఏమైనా చేయవచ్చు. మీ ఆత్మసాక్షిగా చెప్పండి అని పోలీసులను అడిగా. మాకు స్క్రిప్ట్ ఇచ్చారు. దాని ప్రకారం ప్రశ్నలు అడుగుతున్నామని పోలీసులు చెప్పారు. సునీతాకు కూడా నిజాలు లేటుగా తెలిశాయి. ఇంటి గుట్టు ఈశ్వరుడు కూడా పట్టలేడన్న సామెత ఉంది. అయితే సీబీఐ వారు 80 శాతం పట్టారు. మరో 20 శాతం బ్యాలెన్స్ ఉంది. మా బీజేపీ వారు కూడా కచ్చితంగా న్యాయం చేస్తారని భావిస్తున్నా. వివేకా మీద అభిమానంతో వచ్చిన వారందరూ కుటుంబ సభ్యులు ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీకతీతంగా పరోక్షంగా స్టాండ్ ఇచ్చి వారిని గెలిపించాలి. ప్రజాకోర్టులో న్యాయం జరగాలి. వారికి పులివెందులలో కూడా సభ పెట్టుకునే హక్కు లేదా.. అమ్మా మీరు పులివెందులలో సభ పెట్టండి.. మేం వస్తాం, ఇది మంచి చెడ్డల పై పోరాటం, ఆరాటం కాదు. రాజకీయంగా అందరం పరోక్షంగా సపోర్టు చేయాల్సిన అవసరం. నేను ఏమైనా ఫర్వాలేదు. సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా. వివేకా చావు ఇలా జరగకూడదు. అందరికీ సన్నిహితుడు, నాకు మార్గదర్శకుడు అని వైఎస్ చెప్పారు. నా తమ్ముడు నా కన్నా కష్టజీవి అని వైఎస్ తెలిపాడు. అందరూ వివేకా కుటుంబానికి మద్దతు ఇవ్వాలి.

- ఆదినారాయణరెడ్డి, మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఐదేళ్లయినా శిక్ష పడలేదు..



దివంగత ముఖ్యమంత్రి సోదరుడు, ప్రస్తుత సీఎం చిన్నాన్న ఎంపీగా, మంత్రిగా పనిచేసి న వివేకా హత్య జరిగి ఐదేళ్లు అయింది. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ విచారణ చేస్తోంది. అయితే ఐదేళ్లు అయినా నిందితులకు శిక్ష పడలేదు. బాధితులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిందితులకు అండగా ఉంది. న్యాయస్థానంలో న్యాయం ఆలస్యంగా రావచ్చేమో కానీ ప్రజాకోర్టులో మాత్రం వారికి బుద్ధి చెప్పే సమయం వచ్చింది. ఓటుతో వారికి బుద్ధి చెప్పాలి.

-తులసిరెడ్డి, కాంగ్రెస్ నేత

వివేకాలో ఎన్టీఆర్ లక్షణాలు ఉన్నాయి..

దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సిద్ధాంతాలు లక్షణాలు వివేకానందరెడ్డిలో ఉన్నాయి. సాగునీరు ఉంటేనే వ్యవసాయం, పరిశ్రమలు వస్తేనే యువతకు ఉద్యోగాలు వచ్చి సమాజం బాగుపడుతుందనే ఆలోచన ఆయనకు ఉండేది. దివంగత రాజశేఖర్‌రెడ్డి కూడా వివేకానందరెడ్డిని ప్రశంసించారు. న్యాయం కోసం సునీత పోరాటం అభినందనీయం.

- సి.రామచంద్రయ్య, మాజీ ఎమ్మెల్సీ



పాతికేళ్ల బంధం మాది..



వివేకాతో నాది పాతికేళ్ల బంధం. ఇద్దరం ఎంపీగా, ఎమ్మెల్యేగా కలిసి పని చేశాం. కానిస్టేబుళ్లను కూడా సార్ అనే సంబోధిస్తారు. మనం గవర్నమెంటులో ఉన్నాం, ఎస్ఐలు, సీఐలను పేరు పెట్టి పిలవాలని చెప్పినా కూడా సార్ అనే పిలిచే గొప్ప వ్యక్తి వివేకా. అలాంటి వ్యక్తిని దారుణంగా చంపుతారని అనుకోలేదు.

- నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత

వివేకా అజాతశత్రువు..



వివేకా అజాతశత్రువు. పార్టీలకతీతంగా అందరినీ అభిమానిస్తారు. ఆయన ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉండేవారు. ఎంపీగా ఉన్నా మంత్రిగా ఉన్నా కడప జిల్లా సమస్యల పరిష్కారం కోసం పరితపించేవారు. అందుకనేమో పులివెందులలె ఒక ఇల్లు అయితే అప్పట్లో వెంకట్రాద్రి ట్రైన్ రెండో ఇల్లు. ఎందుకంటే నేను విద్యార్థి నాయకుడుగా ఉన్నప్పుడు హైదరబాదు వెళ్లేవాడిని. అప్పట్లో ప్రతిసారి వివేకానందరెడ్డి ఆ ట్రైన్‌లో వచ్చేవారు.

- నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ నేత

నన్ను పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడేవాడు..



2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరం పోటీపడ్డాం. ఫలితం వచ్చిన తరువాత నేను ఎక్కడ కనబడినా వివేకా పలకరించేవాడు. ఎంతో సరదాగా ఉండేవాడు. విమానాశ్రయంలో కానీ బయట కానీ కలిసినప్పుడు తన పక్కనే కూర్చోబెట్టుకుని చక్కగా మాట్లాడేవాడు. ఫ్లైట్‌లో తన పక్కన్న ఉన్నవారిని లేపి నన్ను కూర్చోబెట్టుకుని మాట్లాడేవాడు. ఇలాంటి వ్యక్తిని పోగొట్టుకున్నామంటే చాలా బాధాకరం. వివేకాకు ఆ రకమైన చావు వచ్చిందంటే చాలా బాధ అనిపిస్తుంది. ఇన్సిడెంట్ జరిగిన తరువాత నాకు తెలిసిన వారితో వివేకా ఇంటికి వెళ్లి వారి భార్యా పిల్లలను పలకరించాలని భావించాం. కమలాపురం ఎమ్మెల్యే ఇది టీడీడీ చేసిన పని అని చెప్పారు. దీంతో బాధ కలిగింది. కమలాపురం ఎమ్మెల్యే అలా అనకుంటే చివరి సారిగా ఆయనను చూసే అదృష్టం కలిగేది. ఐదేళ్లు గడిచిపోయాయి. వాస్తవాలు అందరూ గమనించి ఉంటారు. ఇది రాయలసీమ వాసులకు చాలా సిగ్గుచేటు. హత్య జరిగిన రోజు మా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, మా పార్టీలో ఉన్న ఆదినారాయణరెడ్డి, నాపైన అభాండాలు వేశారు. ఏ స్థాయికి పోయిందంటే సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రడ్డి ఉన్నారనే స్థాయికి వచ్చారు. ఇది చాలా దారుణం. సీబీఐ ఎంక్వయిరీకి వెళ్లడంతో వాస్తవాలు వచ్చాయి. ఇప్పుడు కూడా సాక్షి దినపత్రికలో దుష్ప్రచారం చేస్తున్నారు. అయితే అంతిమంగా గెలిచేది న్యాయమే. ఈ కార్యక్రమం పులివెందులలో పెట్టుకోలేక సునీత సొంత కన్వెన్స్‌లో హాలులో పెట్టుకోవాల్సి వచ్చింది. న్యాయస్థానంలో కూడా న్యాయం జరగనప్పుడు ప్రజాకోర్టులోకి వెళ్లాలి.

- బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ

అంగరంగ వైభవంగా కోదండరాముని బ్రహ్మోత్సవాలు

- ఏప్రిల్ 22న సీతారాముల కల్యాణం
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, మార్చి 15: ఏకశిలా నగరి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16వ తేది నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఒంటిమిట్టలో శుక్రవారం ఆయన అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కోదండ రామాలయం ప్రాంగణంలో భక్తులకు అన్నదానం, తాగునీరు, క్యూలైన్ల ఏర్పాటు వంటి వాటిపై అధికారులతో చర్చించారు. ఏప్రిల్ 16న సాయంత్రం అంకురార్పణతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులకు అనుమతించాల్సిన విధానంపై మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికి ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, విజిలెన్స్ డీఎస్పీ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

గుర్రంకొండ, మార్చి 15: మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామివారికి అంకురార్పణ కార్యక్రమాన్ని టీటీడీ వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వస్తివాచనం, పుణ్యాహవచనం, వాస్తు హోమం, అగ్నిప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, రక్షాబంధనం కార్యక్రమాలను నిర్వహించి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరగాలని సకల దేవతలను ఆహ్వానించారు. అనంతరం అంకురార్పణను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయాధికారి కోరారు.



స్వామివారికి అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

రేపు గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షలు

- పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్

కడప(కలెక్టరేట్), మార్చి 15: ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం కట్టుదిట్టమైన చర్యల మధ్య, పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేకాధికారులు సయ్యద్ నాగూర్ షరీఫ్, మానిటర్ (అసిస్టెంట్ సెక్రటరీ) ఎం.రామాంజిలతో పాటు లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షలను ఎలాంటి విమర్శలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రా లకు ఉదయం 9 నుంచి 9-45 గంటలలోగా, మధ్యాహ్నం 1 గంట నుంచి 1-45 లోగా చేరుకోవాలన్నారు. ప్రతి పరీక్షాకేంద్రంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 7 కేంద్రాలు, చెన్నూరు మండలంలో 1, చింతకొమ్మదిన్నె పరిధిలో 4, చాపాడు మండలంలో 1, ప్రొద్దుటూరులో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పా టు చేశామన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఏవైనా సందేహాలుంటే 08562-246344 నెంబర్‌కు ఫోన్ చేయాలని జేసీ తెలిపారు. 17 వ తేదీ వరకు ఈ కంట్రోల్ రూమ్ కాల్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్లు, లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రాచమల్లును ఓడించడమే లక్ష్యం

- గుంపులు ఏర్పడకుండా ఐక్యత చాటుతాం
- టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు



కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, మార్చి 15: ప్రొద్దుటూరు ప్రజల పాలిట రాక్షసుడుగా మారిన ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్టు కోసం తనతో సహా ఐదుగురు ప్రయత్నించామన్నారు. పార్టీ వరదరాజులరెడ్డికి టికెట్టు ఇచ్చిందన్నారు. టికెట్టు రానందుకు బాధవుందని అయినా పార్టీని ఇక్కడ గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. టీడీపీలో గుంపులకు తావు లేకుండా ఐక్యంగా ముందుకు వెళతామన్నారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి 200 రోజులకు పైగా 10 లక్షల మందికి అన్నదాన సేవలు అందించామన్నారు. చంద్రబాబు మీద తమకు నమ్మకం ఉందన్నారు. తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తల తో చంద్రబాబునాయుడును కలుస్తామన్నారు. ఆయన ఆదేశాల మేరకు తామంతా ప్రొద్దుటూరులో టీడీపీ విజయానికి పనిచేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకండి

- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి
- ఓటర్లకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పిలుపు

జమ్మలమడుగు పెద్దదండ్లూరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, డీఎస్పీ యశ్వంత్



జమ్మలమడుగు, మార్చి 15: ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మలమడుగు మండలంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా పెద్దదండ్లూరు గ్రామాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. గతంలో జరిగిన ఎన్నికలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే దేవగుడి, గొరిగెనూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. దేవగుడి గ్రామంలో స్థానిక అధికారులు, ఓటర్లతో మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఎవరి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దన్నారు. ప్రలోభాలు, బెదిరింపులకు ఎవరైనా పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలి

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ విధులు నిర్వహించాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. కేంద్ర సాయుధ బలగాలతో ఆయన పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు విధులకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. ప్రతి గ్రామ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలన్నారు. రానున్న ఎన్నికలు అత్యంత కీలకంగా మారిన నేపథ్యంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి పార్టీలకతీతంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేవారిపై నిఘా పెట్టాలన్నారు. ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా పోలీసు శాఖ నిబద్ధతతో, నిజాయితీతో విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాల ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జితేంద్రకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్, ప్రొబెషనరీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత



- జీడీ, సిగెరెట్‌కు ఎక్కించి తాగుతున్న యువత
- పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, మార్చి 15: పక్క రాష్ట్రమైన తెలంగాణాలో గంజాయి డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుంటే.. మన రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగుతున్నా పట్టించుకునే నాధుడే లేరు. దీంతో యువత గంజాయి తాగుతూ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. ఖాజీపేట మండల పరిధిలో గంజాయి, అక్రమ మద్యం యదేచ్ఛగా దొరుకుతుండడంతో యువత మత్తులో ఊగుతున్నారు. ఖాజీపేటకు అటు కమలాపురం, ఇటు బద్వేలు నుంచి గంజాయి ప్యాకెట్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో ప్యాకెట్ డిమాండ్‌ను బట్టిరూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ఇక వైసీపీ ప్రభుత్వం వచ్చాక మద్యం ధరలు బాగా పెరగడంతో క్వార్టర్‌కు రూ.200 చెల్లించాల్సిందే. గంజాయి ప్యాకెట్ అయితే అయిదు లేక ఆరుసార్లకు వస్తుంది. దీనికి తోడు మద్యం కంటే గంజాయి మత్తు ఎక్కువసేపు ఉంటుందని.. యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. బీడీ, సిగరెట్లలో ఉన్న పొడిని తొలగించి అందులోకి గంజాయిని ఎక్కించి బహిరంగ ప్రదేశాల్లో తాగుతున్నారు. కొంత మంది యువకులు మద్యం, గంజాయి సేవించి మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని చెబుతున్నారు.

తూతూ మంత్రంగా చర్యలు

మండలంలో అక్రమంగా గంజాయి, మద్యం విక్రయిస్తున్నా ఎటువంటి చర్యలు లేవు. తూతూ మంత్రంగా మద్యం బాటిళ్లు పట్టుకోవడం, కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తప్ప వీటిని నియంత్రించేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోకపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే యువత చెడు అలవాట్లకు బానిసలైపోతారని చర్చించుకోవడం విశేషం. దీనిపై ఖాజీపేట సీఐ రామాంజలును వివరణ కోరగా.. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని.. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తాము కూడా ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు చేపడతామని తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గంజాయి ఆకు

గుట్టుగా.. గుట్కా రవాణా

- తెలంగాణ, కర్ణాటక నుంచి దిగుమతి
- పట్టణాలకు, గ్రామాలకు యథేచ్ఛగా సరఫరా
- పులివెందులలో జోరుగా విక్రయాలు



పులివెందుల టౌన్, మార్చి 15: పులివెందుల ప్రాంతంలో గుట్కా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అక్రమ వ్యాపారాన్ని ఎంచుకున్నారు. నిషేధిత గుట్కు, ఖైనీ, పాన్‌పరాగ్ తదితర ప్యాకెట్లను బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ కొంతమంది వ్యాపారులు ఆ సరుకును రాత్రిపూట రహస్యంగా గ్రామాలకు, పట్టణాలకు చేరవేస్తున్నారు. రిటైల్ వ్యాపారులు కొంతమంది ఆ సరుకును విక్రయిస్తున్నారు.

పులివెందుల పట్టణంలో పలు టీ దుకాణాలు, కిరాణ కొట్లు, బండి బంకులలో గుట్టుగా విక్రయాలు సాగిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పై నుంచి వచ్చిన సరుకును రహస్యంగా గోడౌన్లలో దాచి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. బిస్కెట్లు, బ్రెడ్లు తదితర తినుబండారాల వ్యాపారం చాటున గుట్కా, ఖైనీ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. పొగాకుతో తయారు చేసిన ఈ ప్యాకెట్లను తీసుకున్న వ్యక్తులు మత్తుకు బానిసలై నిత్యం కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పోలీసులు దాడులు చేసిన ప్రతిసారి భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లు దొరికేవి. ఇటీవల కాలంలో పోలీసుల దాడులు లేకపోవడం, అధికారులు దృష్టి సారించక పోవడంతో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు గుట్కా విక్రయాలపై దాడులు చేసి యువతను కాపాడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పులివెందుల అర్బన్ సీఐ శంకర్ రెడ్డిని వివరణ కోరగా.. తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని.. ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గుట్కా ప్యాకెట్లు

68 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), మార్చి 15: కడప విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 68 రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మాసుంబాషా ఆదేశాల మేరకు శుక్రవారం కడప సీఎస్‌డీటీతో కలిసి దాడులు నిర్వహించారు. చెన్నూరు వనంవీధిలో కాటం బ్రహ్మయ్య అనే వ్యక్తి రేషన్‌కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ఓ ఇంట్లో ఉంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశారు. ఇంట్లో ఉన్న 68 రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేశారు. దీని విలువ రూ.1,45,600 ఉన్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మయ్యను చెన్నూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించగా పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్రెడ్డి, అశోక్‌కుమార్, మనోజ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి..20 మంది అరెస్టు

- రూ.2.40లక్షల నగదు స్వాధీనం
- వాహనాలు సీజ్

కొండాపురం, మార్చి 15: మండలంలోని ఎనమలచింతల గ్రామం శివార్లలో జరుగతున్న పేకాట స్థావరంపై దాడి చేసి పోలీసులు భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.2.40లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మూడు ఫోర్‌వీలర్లు, రెండు టూవీలర్లు సీజ్ చేసి.. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పీలేరు, మార్చి 15: మద్యానికి బానిసైన పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెకు చెందిన ఎం.రాజశేఖర్(34) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిస కావడమే కాకుండా తరచూ కుటుంబసభ్యులతో గొడవలకు పాల్పడే రాజశేఖర్ గురువారం రాత్రి తన ఇంటిపైనున్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ విషయం శుక్రవారం ఉదయం కనుగొన్న కుటుం బసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజశేఖర్ మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15: అనంతపురం నగరంలోని ఆర్డీటీ అనంత క్రీడాగ్రామంలో రాష్ట్ర సబ్‌జూనియర్ బాల, బాలికల జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్ర వారం నిర్వహించారు. సుమారు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఎంపిక చేసిన క్రీడాకారుల వివరాలను ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు ప్రకటిం చారు. బాలుర జట్టులో నానిబాబు, రోహిత్, జ్యోతి ప్రకాష్, జనార్ధన్ (విజయ నగరం జిల్లా), కుష్యంత్ (కృష్ణా జిల్లా), కార్తీక్, పార్థసారధి (గుంటూరు), శశి, మురళీ (అనంతపురం), వంశీ (చిత్తూరు), జగన్ (కర్నూలు), పవన్ (శ్రీకాకుళం), ధీరజ్ (నెల్లూరు), చరణ్‌తేజ (ప్రకాశం), బద్రినాథ్ (కడప), సాత్విక్ (కర్నూలు), మనోజ్ (విశాఖపట్నం), వీరబాబు (తూర్పుగోదావరి) ఉన్నారు.

బాలికల జట్టులో.. దేవిప్రియ (శ్రీకాకుళం), చైతన్య, తేజస్వని, భువనేశ్వరి (విజయనగరం), తిరుమల (గుంటూరు), దీవెన, వాసంతి (ప్రకాశం), సానియా, భాగ్యలక్ష్మి (అనంతపురం), ఉమ, హిందూ, హేమలత (చిత్తూరు), పూర్ణిమ (తూర్పుగోదావరి), వినయ, సన్నీ (కడప), కృత్తిక (కర్నూలు) ఉన్నారు. ఈ నెల 20 నుంచి ఆర్డీటీ స్టేడియంలో శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఈనెల 28 నుంచి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, చిత్తూరు రమేష్, కృష్ణా జిల్లా సాంబశివరావు, గుంటూరు నరసింహారెడ్డి, పీడీలు గోపాల్‌రెడ్డి, విజయ్, లతాదేవి, చంద్ర, సంజీవరాయుడు, సురేష్, కోచ్‌లు బద్రి, మహేష్, సింహాద్రి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 15: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలానికి చెందిన ఓ బాలిక(17) గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తూనికలు - కొలతల్లో మోసపోవద్దు



తూకాలు చూపిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి

కడప (నాగరాజుపేట), మార్చి 15 : తూనికలు, కొలతల విషయంలో ప్రజలు మోసాలకు గురి కావద్దని స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఆర్‌ఆర్‌ఎం ఫిజియోథెరపీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం నిత్యం ఎన్నో రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటామని, అయితే తూనికలు, కొలతల్లో మోసాలకు గురి కాకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. 1986 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నాణ్యమైన వస్తువులను పొందడం వినియోగదారుల హక్కు అన్నారు. మార్కెట్లో ఉన్న వస్తువులను వినియోగించేటప్పుడు ఏవైనా లోటుపాట్లు కనిపిస్తే ఆ వస్తువులను లేదా సేవలను గురించి ప్రశ్నించే హక్కు వినియోగదారుడికి ఉందన్నారు. దుకాణంలో కిలో కందిపప్పు నిజానికి 800 గ్రాములు ఉంటుందని, పాలు, కిరోసిన్ కొలతల విషయంలో తరుగు సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. పెట్రోలు బంకుల్లో ఆపరేటర్లు చేతివాటంతో వాహనదారులు ఎంతో కొంత నష్టపోతుంటారన్నారు. రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యాన్ని అమ్మేటప్పుడు 70 కిలోల బస్తాకు దాదాపు ఆరు, ఏడు కిలోల వరకు తూకంలో మోసాల కారణంగా రైతులు నష్టపోతుంటారన్నారు. ఇలాంటి మోసాలను అరికట్టే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చిన్నరెడ్డన్న



పీసీ రెడ్డన్న

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 15: పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పి.చిన్నరెడ్డన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం గుంటూరు హిందూ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన 48వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అన్నమయ్య జిల్లా రాయచోటి మాజీ ఎంఈఓ, పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.చిన్నరెడ్డన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డిసుబ్బారెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రామాంజనేయరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ సుబ్బారెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్ వివేకాకు ఘన నివాళులు



తండ్రి వైఎస్ వివేకా సమాధిపై పూలమాల వేస్తున్న వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం పట్టణంలోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరది శివప్రకాష్‌రెడ్డి, జగన్ బాబాయ్ వైఎస్ సుధీకర్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, అభిమానులు నివాళులు అర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివేకా పార్క్‌లోని వివేకానందరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంతర్జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



బంగారు పతకాన్ని అందుకుంటున్న నాగరాజు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 15: మండలంలోని దప్పేపల్లె గ్రామం మేడిమాకులగుంతకు చెందిన కొరకుంట నాగరాజు అనే యువకుడు అంతర్జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల సంయుక్త భారతీయ కేఎల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మస్థలలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్‌లో 74 కిలోల విభాగంలో 380 కిలోలు ఎత్తి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు ఇంటర్ నేషనల్ స్థాయిలో ఎస్‌బీకేఎఫ్ నేపాల్ పోక్రాలో జరగబోవు పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29న నేపాల్‌కు వెళ్లాల్సిన నాగరాజుకు ఆర్థికస్తోమత లేకపోవడంతో దాతలు సహకరించి ఆదుకోవాలని కోరుతున్నారు. సహాయం చేసేవారు 7075824889, 8340935277 నెంబరుకు కాల్ చేయాలని కోరుతున్నాడు.

జొన్నరైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

కడప(రూరల్) మార్చి 15: ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా హైబ్రిడ్ జొన్నలను రూ.3180ల మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని.. రైతులు రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మార్కెఫెడ్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ డీఎం నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పై మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఈ మేరకు 15 నుంచి రైతు బరోసా కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఆలయాల సందర్శనకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 15: ప్రత్యేక పుణ్యక్షేత్రాలు సందర్శనకు మదనపల్లెడిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లె మల్లయ్య కొండకు ప్రతి సోమవారం మదనపల్లె నుంచి ఉదయం 5.50 గంటలకు, 6.30 గంటలకు రెండు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అవి తంబళ్లపల్లె మల్లయ్యకొండ నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత మదనపల్లెకు బయలుదేరి వస్తాయన్నారు. అలాగే అరుణాచల గిరిప్రదక్షిణం కోసం ప్రతి పౌర్ణమి రోజు మదనపల్లె నుంచి ఉదయం 9గంటలకు బయలుదేరి అనంతరం మరుసటి రోజు ఉదయం 4 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందని తెలిపారు. మరెన్ని వివరాలకు సెల్ నెంబర్లకు 7382875034, 7382876638, 7382877300 సంప్రదించాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



చెన్నూరు వద్ద టిప్పరులో తరలుతున్న ఇసుక

చెన్నూరు, మార్చి 15: నిబంధనలకు నీళ్లొదిలి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారులు అనుమతినిచ్చిన క్వారీలు, లేదా డంప్ యార్డుల నుంచే తీసుకుపోవాలి అనే నిబంధన ఉన్నా మండలంలోని పెన్నానది నుంచి ఇసుక పట్టపగలే రవాణా సాగుతోంది. హైవేలో ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతున్నా వాటిని ఆపేవారే లేరు. ప్రభుత్వ అనుమతి ఉందో, లేదో తెలియని పరిస్థితి. ఏ శాఖ అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు ఉన్నారు. కనీసం వాటిని ఆపి అడిగే పరిస్థితి కూడా లేదు. దీంతో కొండపేట, బలసింగాయపల్లె, ములపాక, పుష్పగిరి ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. అలాగే హైవేలో రేయింబవళ్లు ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఖాజీపేట మండలంలోని కొన్ని ట్రాక్టర్లు ఈ గ్రావెల్‌ను తీసుకువస్తున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా నిలపాలని పలువురు పేర్కొంటున్నారు.

పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 15: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 30వ తేది వరకు జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, జిల్లా వ్యాప్తంగా 58ఏ కేటగిరి, 55బీ కేటగిరి, 16 సీ కేటగిరి సెంటర్ల చొప్పున మొత్తం 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో జిల్లాలోని 492 పాఠశాలల నుంచి 22,466 మంది రెగ్యులర్ విద్యార్థులు, 3056 మంది పరీక్ష తప్పిన విద్యార్థులతో కలిపి మొత్తం 25,522 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. అందులో 13,003 బాలురు, 12,519 మంది బాలికలు ఉన్నట్లు చెప్పారు.

జిల్లాలోని 129 పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులతో పాటు అడిషినల్ డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 10 రూట్స్ ఏర్పాటు చేసి కస్టోడియన్స్‌తో పాటు జాయింట్ కస్టోడియన్స్‌ను నియమించి పరీక్ష పేపర్ల స్టోరేజ్ కోసం 31 చోట్ల పాయింట్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన డెస్కులు ఏర్పాటుతో పాటు తాగునీటి సౌకర్యం, గాలి, వెలుతురు ఉండే విధంగా ఫ్యాన్లు, లైట్స్ సిద్ధం చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండకూడదన్నారు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదని ఆయన సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డీఈవో కార్యాలయ ఏడీ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ

● పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15 : అభివృద్ధిలో దేశానికి తలమానికం టీడీపీ ప్రభుత్వమని పేద వారు ఆత్మగౌరవంగా బతకాలన్నదే ఎన్టీఆర్ ఆశ యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరం 37వ డివిజన్ అఫ్జల్‌ఖాన్ కాలనీ 27వ డివిజన్ హౌసింగ్‌బోర్డు కాలనీల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, వేణు, గోపిరెడ్డి, సురేష్, నరసింహారెడ్డి, సుధాకర్, చంద్రశేఖర్, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.




బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి... చెన్నూరు రామనపల్లెలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

సూపర్‌సిక్స్‌పథకాలతో అందరికీ ప్రయోజనం

చెన్నూరు, మార్చి 15 : చంద్రబాబు చెప్పినట్లుగా టీడీపీ అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్ పథకాలు అందుతాయని, దీంతో ప్రతి భవిష్యత్తుకు టీడీపీ భరోసా కల్పించినట్లు అవుతుందని రైతు విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని రామనపల్లె గ్రామంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భవిష్యత్తుకు బాబు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించార. ఇందులో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ నాలుగున్నరేళ్లలో జగన్ కేవలం తన భజనపరులకు మాత్రమే అవకాశం ఇచ్చి వారి బాగు కోసం రాష్ట్ర సంపద దోచిపెట్టారన్నారు. ఇది తెలిసిన ఆ పార్టీ నేతలు టీడీపీలోకి వస్తున్నారని అన్నారు. ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపి శాశ్వతంగా కనుమరుగు చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నరసింహాచారి, మండల రైతు విభాగం ఉపాధ్యక్షుడు క్రిష్ణారెడ్డి తదిదతరులు పాల్గొన్నారు.

'జగన్‌కు కేసీఆర్ గతే పడుతుంది'



మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15: తెలంగణాలో కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే జగన్‌రెడ్డికి పడుతుందని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్‌నాథరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. శుక్రవారం కడప నగరం తెలుగుయువత కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2018 గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తున్న తెలుగుయువత టీఎన్ఎస్ఎఫ్ నేతలకు నోటీసులు ఇచ్చి, నిర్బంధాలు అరెస్టులు చేయడం పిరికిపంద చర్య అన్నారు. 49వేల ఓఎంఆర్ షీట్లను మార్చి అంగట్లో సరుకులు అమ్మినట్లు వైసీపీ ప్రభుత్వం 162 గ్రూప్-1 ఉద్యోగాలను కోట్ల రూపాయలకు అమ్ముకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ ఉద్యోగాల విషయంలో అక్రమాలకు పాల్పడడం బాధాకరమని, ఉద్యోగాలు అమ్ముకున్న ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు, యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు లోకేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌లో అవకతవకలపై

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15: గ్రూప్-1 2018 పోస్టుల మెయిన్స్‌లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం జాప్ కార్యాలయనలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ పూర్తి నిర్లక్ష్యమేనని, 2018 గ్రూప్ మెయిన్ రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు దానికి నిదర్శనమన్నారు. దాదాపు 49వేల ఓఎంఆర్ షీట్‌లలో మూల్యాంకనంలో అవకలవకలు ఏర్పడ్డాయని, అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్ పరీక్షనే రద్దు చేసిందన్నారు. పెద్దల హస్తం లేనిదే ఇలా జరిగి ఉండదని అభిప్రాయపడ్డారు. కష్టపడి కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గి పరీక్షలు రాస్తే ఇలాంటి చర్యలు నిరుద్యోగుల బలన్మరణాలకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణలో పూర్తి వైఫల్యం స్పష్టమవుతోందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఆరు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, కార్యర్శి చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు నరసింహస్వామి

● రేపు ఆరాధన మహోత్సవం

సికెదిన్నె, మార్చి 15: అవధూత యోగి నరసింహస్వామి మహిమాన్వితుడని స్థానికుల విశ్వాసం. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల పంచాయతీ జింకల వంక సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి భక్తుడు అవధూత శాండిల్య గోత్రోబవుడు చిన్నపల్లి యోగినరసింహస్వామి 216వ ఆరాధన మహోత్సవం ఈనెల 17న ఆదివారం నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యోగినరసింహ ఎంతో మహిమగలవాడని, చుట్టుపక్కల గ్రామస్థులు ఆయన్ను ఒక దైవాంశ సంభూతుడుగా ఆరాధించేవారన్నారు. స్వామివారికి జిల్లాతో పాటు అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో సైతం భక్తులు ఉన్నారని, ప్రతి సంవత్సం ఆరాధనకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు. ఆరాధన మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సాసవుల చిన్నమ్మ కథ, తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. అలగే ఆరాధన సందర్భంగా బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్కంఠ భరితంగా సాగే ఈ పోటీలకు జనం పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

వినియోగదారులు వస్తువు నాణ్యతను తెలుసుకోవాలి



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్, మార్చి 15: వినియోగదారులు తాను కొన్న వస్తువు నాణ్యతను తెలుసుకోవాలని నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణమ్మ సూచించారు. శుక్రవారం పాఠశాలలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వినియోగదారుల ఫోరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వస్తువు నా ణ్యతను పరీక్షించుకోవడం ఎలా, ఆ నాణ్యతను ఎవరు నిర్దేశిస్తారు, గుర్తించిన నాణ్యత లోపాన్ని ఎవరికి ఫిర్యాదు చేయాలి, బీఎస్ కేర్ యాప్‌ను ఎలా ఉపయోగించాలి తదితర అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాండర్డ్ క్లబ్ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాడీఫ్రీజరు వితరణ



బాడీఫ్రీజరు అందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కమలాపురం రూరల్, మార్చి 15 :జిల్లా విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కమలాపురం మదర్‌థెరిసా సేవా సమితి ట్రస్టు సభ్యులకు విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత బాడీ ఫ్రీజర్ బాక్సు అందించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈ రమణ, ప్రొద్దుటూరు శ్రీనివాస్‌రెడ్డి ట్రస్టు సెక్రటరీ డీఆర్ నాగరాజు ట్రస్టు సభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ ఉద్యోగం చేసుకుంటూ అందరూ కలిసి ట్రస్టులా ఏర్పడి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అందులో తనను భాగస్వామి చేయడం సంతోషంగా ఉందన్నారు. అలాగే విద్యుత్ ఉద్యోగుల ట్రస్టు తరఫున చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, నిమ్మరసం, పానకంలాంటివి పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ చాంద్‌బాషా, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'కాపు కులానికి చీడపురుగు ముద్రగడ'

చెన్నూరు, మార్చి 15 : కాపు కులానికి చీడ పురుగులా దాపురించి కాపు బలిజల గౌరవాన్ని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కాళ్లవద్ద తాకట్టుపెట్టిన మాజీ మంత్రి ముద్రగడను రాష్ట్రంలోని బలిజ కులస్తులంతా తరిమికొట్టాలని జిల్లా కాపు సంఘం నాయకుడు ఐటీడీపీ కడప పార్లమెంటు ఉపాధ్యక్షుడు గంధం ప్రసాద్ అన్నారు. చెన్నూరులో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాపుల ఉన్నతికి ఎంతో మంది నేతలు పార్టీ పెడితే ఇప్పుడు కాపులను ఉద్ధరిస్తాం, వారికి అన్యాయం జరిగింది, వారిని ఎవరూ పట్టించుకోలేదు అని నీచమైన ప్రగల్భాలు పలికి ఇప్పుడు కాపుజాతి పరువు తీశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తిని రాష్ట్రంలోని ఏ కాపు నేతలు కూడా దగ్గరకు రానీయకూడదని, దగ్గరకు వస్తే నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి లబ్ధి చేకూరాలని తన స్వార్థం కోసం కాపులకు తీరని ద్రోహం చేస్తున్నాడని, ఇప్పుడు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. గతంలో కూడా ఇంట్లో ఉండి రకరకాల స్టేట్‌మెంట్లు ఇస్తూ కాపులను తప్పుదోవ పట్టించాడన్నారు. అందుకే వాస్తవాలు కాపులు గమనించి ముద్రగడ లాంటి నేతను రాష్ట్రంలో తిరగకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ చెన్నూరు పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, మండల అధికార ప్రతినిధి అతికారి విశ్వం, నేతలు అతికారి గౌతం, కె.జయరాముడు, ఆర్.చలపతి పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

కడప (కల్చరల్), మార్చి 15 : నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి కాలనీలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలు ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటి నిర్వాహకులు గోవిందు నాగరాజు, సీఆర్‌ఐ సునీల్, పల్లా రాధాక్రిష్ణ, సంగినాదం ఆంజనేయులు, కొరముట్ల పెద్దసుబ్బరాయుడు, ఇట్టే వేణులు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు పార్కు నుండి ఊరేగింపుతో మొదలై బిందెసేవకు శ్రీవిజయదుర్గాదేవి ఆలయానికి భక్తులు ఊరేగింపుగా చేరుకుంటారన్నారు. అర్ధరాత్రి 12గంలకు శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతులు విజయదుర్గాదేవి కాలనీలో పురవీధుల్లో భక్తులకు కనువిందు చేస్తాయన్నారు. కావున భక్తులు జ్యోతుల ఉత్సవంలో పాల్గొని చౌడేశ్వరి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

18న చిరుధాన్యాల విలువ జోడింపుపై శిక్షణ

సీకేదిన్నె, మార్చి 15: చిరుధాన్యాల విలువ జోడింపుపై శిక్షణ కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో ఈనెల 18 నుంచి రెండు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు శాస్త్రవేత్త ప్రశాంతి తెలిపారు. చిరుధాన్యాలను ఉపయోగించి వ్యాపారాన్ని మెరుగుపరచుకోవడంపై రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



పసుపులేటి శ్రీనివాసులు

కడప(కలెక్టరేట్), మార్చి 15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్ల సంఘం శుక్రవారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పసుపులేటి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన నియమాకానికి సహకరించిన ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తూతూ మంత్రంగా ఓటర్ల అవగాహన సదస్సు

ఖాజీపేట, మార్చి 15: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా రిగ్గింగ్ కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడికక్కడ ఓటర్లకు అవగాహన నిర్వహించాలని చెబుతున్నా అందుకు విరుద్ధంగా ఖాజీపేటలో నిర్లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట ఉర్దూ పాఠశాలలో 194, 195, 196, 197 బూత్‌లలో 2019 ఎలక్షన్‌లో 60 శాతం మాత్రమే పోలింగ్ కావడంతో అక్కడ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించి ఓటర్లలో చైతన్యం తీసుకురావాలని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. దీంతో శుక్రవారం ఉర్దూ పాఠశాలలో ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ విశేషమేమిటంటే ఆ పోలింగ్ బూత్‌లలోని ఓటర్లకు సమాచారం ఇవ్వకపోగా తూతూ మంత్రంగా విద్యార్థులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచి అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతో ఇదేనా చైతన్యం తీసుకురావడమంటే అని ఓటర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ సమావేశంలో ఇద్దరు మాత్రమే ఓటర్లు ఉండడం మరో విశేషం. ఏది ఏమైనా ఓటర్లను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు. ఓటర్లు చైతన్యవంతులు అయితే సమాజాన్ని మేల్కొలపగలరన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి



మాట్లాడుతున్న పార్థసారధిరెడ్డి

వేముల, మార్చి 15: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకతంగా ఉన్న వ్యక్తులపై గాని వ్యవస్థలపై గాని అసత్య ప్రచారాలు చేయడంలో సాక్షి దినపత్రిక ఎప్పటికి ముందుంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. శుక్రవారం వేములలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ గురువారం కడప ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడిన మాటలను సాక్షిపత్రిక వక్రీకరించి రాయడం వారి వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. తాను కడపలో మాట్లాడిన మాటలలో వివేకానందరెడ్డి హత్య కేసులో వారి సొంత కుటుంబ సభ్యులకే అనుమానం లేదు అన్నట్లు వార్తను రాశారని, అయితే తాను వివేకానందరెడ్డి హత్య జరిగిన నాటి నుంచే ఇప్పటి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిల హస్తం ఉందని అనేక పత్రికలలో, సామాజిక మాధ్యమాలలో చెప్పానన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సాక్షి పత్రికలో వార్తలు రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

కడప (నాగరాజుపేట), మార్చి 15 : జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కా ర్యాలయ ముఖ్య అధికారి ఎ.సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. ప్రముఖ బ్యాంకుల్లో వివిధ హోదాల్లో ప్రైవేటుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హోదాను బట్టి రూ.12 వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ లేదా పీజీ కలిగి ఉండాలన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించి సర్టిఫికెట్లతో పాటు ఫోటోలు తీసుకుని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10గంటలకు చేరుకోవాలని ఆయన కోరారు.

ముద్రగడ కాపు బలిజల ద్రోహి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15 : ముద్రగడ కాపు బలిజల ద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌తో లోపాయికార ఒప్పందం వల్లనే గతంలో కాపు ఉద్యమం ముద్రగడ నడిపారన్నారు. ముద్రగడ జగన్ కోవర్టు అన్నారు. ముద్రగడ మంత్రిగా ఉన్నప్పుడు కాపులకు నో ఎంట్రీ అని బోర్డు పెట్టిన విషయం గుర్తు చేశారు. మొదటినుంచి జగన్ కనుసన్నల్లోనే ఆయన నడుస్తున్నారని చెప్పారు. ముద్రగడకు టికెట్ వచ్చినా డిపాజిట్ కూడా రాదని స్పష్టం చేశారు. కాపు, బలిజలు ముద్రగడను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. బలిజల ద్రోహి పార్టీగా వైసీపీని అభివర్ణించారు. అలాంటి పార్టీలో ముద్రగడ చేరడం సిగ్గుచేటని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ పంట రసీదు పొందాలి



దొండ్లవాగులో పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఏఓ రమేష్ తదితరులు

లింగాల, మార్చి 15: రబీలో పంట సాగుచేసిన ప్రతి రైతు పంటమోదు ధ్రువీకరణ పత్రాలు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని దొండ్లవాగు గ్రామంలో పంట నమోదు చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పత్రంలో పొలంలో ఏయే పంటలు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో సాగుచేశారు, వర్షాధారమా, నీటి ఆధారమా, పంట నాటిన తేదీ, పంట రకాలు, ఖాతా నెంబర్, సర్వే నెంబర్ తదితర వివరాలు ఇందులో చూసుకోవచ్చన్నారు. పంటల బీమా, పంట నష్టపరిహారం, రైతు భరోసా, పీఎం కిసాన్, సున్నా వడ్డీ పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కావున రైతులు పంట నమోదు రసీదు పత్రాలను ఆయా ఆర్బీకేలలో పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు భవాని రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి



వీఎన్‌పల్లెలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వీరపునాయునిపల్లె, మార్చి 15: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ వెంకటరెడ్డి ప్రజలకు సూచించారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని ఉరుటూరు, వీఎన్‌పల్లె, అనిమెల, పాలగిరి, తంగేడుపల్లెలో కార్డన్ అండ్ సెర్చ్, వాహనాల తనిఖీ నిర్వహించారు. పాలగిరి, తంగేడుపల్లె క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. 35 మంది ఎస్ఎస్‌బీ సిబ్బందితో పాటు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేయాలి

● జిల్లా రెవెన్యూ అధికారికి మొల్ల సాహితీపీఠం వినతి



వినతిపత్రం అందజేస్తున్న హనుమంతరావు

కడప (కల్చరల్), మార్చి 15 :జిల్లా కేంద్రమైన కడపలో మహాకవయిత్రి మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేసి గోపవరం మండలానికి మొల్ల గోపవరం మండలంగా పేరు పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించినట్లు మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి చాంబరులో ఆయనకు వినతిపత్రం అందించారు. కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొల్ల పేరు పెట్టాలని, మొల్ల సాహిత్య పీఠం కార్యాలయానికి ఐదు సెంట్ల స్థలం కేటాయించాలని, గోపవరంలోని రామాలయాన్ని, శ్రీకంఠ మల్లేశ్వర ఆలయాన్ని, మొల్లబండను పునర్నిర్మాణం చేయాలని, అలాగే మొల్ల జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టాలని కోరారు.

వైశ్య కార్పొరేషన్ డైరెక్టరుగా పుల్లయ్య

కడప (మారుతీనగర్), మార్చి 15 : ఏపీ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టరుగా కడపకు చెందిన చింతకుంట పుల్లయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వైశ్యుల అభ్యున్నతికి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ద్వారా వైశ్యుల ఉన్నతి కోసం శ్రమిస్తానని వెల్లడించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప(రూరల్) మార్చి 15 :జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 15న ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి ఖర్చు లేకుండా రాజీ మార్గం లో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో ఒక సారి కేసు పరిష్కారం అయితే సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. ఇలాంటి ప్రయోజనాలు కలిగిన లోక్ అదాలత్‌ను ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకస్మికంగా ఉపాధి హామీ పనులు తనిఖీ



పండ్ల తోటలను పరిశీలిస్తున్న పీడీ

ఖాజీపేట, మార్చి 15: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ యధుభూషణ్ రెడ్డి ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీలోని ఫారెస్టు రోడ్డులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడంతోపాటు పండ్ల తోట పెంపకం రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం ఆరు గంటలకు వచ్చి 11 గంటలకు ఇంటికి వెళ్లేలా చూడాలని, కూలీల వెంట తాగు నీరు తెచ్చుకునేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓఆర్ఎస్ ప్యాకెట్లు తెచ్చి కూలీలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, ఏపీవో చంద్రశేఖర్, టీఏలు సుబ్బారావు, గురుబాబు, ఈసీ రాధాకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థి ఎవరు అయినా గెలుపునకు కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న విజయమ్మ

బద్వేలు టౌన్, మార్చి 15 : పొత్తులో భాగంగా బద్వేలులో ఎవరికి కేటాయించినా అభ్యర్థి ఎవరైనా గెలుపునకు కృషి చేయాలని టీడీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కా ర్యాలయంలో ఆయా మండల నాయకులతో మున్సిపాలిటీ మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బద్వేలులో టీడీపీ అభ్యర్థిగా రోశన్నను ఎన్నుకుని నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారని, నేడు బద్వేలు స్థానం బీజేపీకి కేటాయస్తారనే విషయంపై చంద్రబాబుతో చర్చించడం జరి గిందన్నారు. ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా టీడీపీ కార్యకర్తలు, నాయకులు చంద్రబాబును అధికరంలోకి తెచ్చేందుకు కృషి చేయాల న్నారు. మండల పార్టీ నాయకులు బూత్ కన్వీనర్లు అయోమయానికి గురి కావద్దని మీకు అండగా టీడీపీ, నేను, రితీష్‌రెడ్డి అండగా ఉంటామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నిమండలాల టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైంది

ప్రొద్దుటూరులో వరద ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు మార్తల లక్ష్మీరెడ్డి, దువ్వూరులో వార్డు సభ్యుడితో పాటు పలువురు వైసీపీ నేతలు చేరిక



వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు మార్తల లక్ష్మీరెడ్డి వర్గం, టీడీపీలో చేరిన దువ్వూరు మండల వైసీపీ నాయకులుతో పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రొద్దుటూరు ,మార్చి 15 : ప్రొద్దుటూరులో వైసీపీకి కౌంట్ డౌన్ మొదలైందని ఆపార్టీలో వుండే అసమ్మతి నేతలు టీడీపీలో చేరడం ప్రారంభంకానుందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చౌటపల్లెలో వైసీపీ నాయకుడు మార్తల లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ మార్తల ఈశ్వరమ్మతో పాటు 100 కుటుంబాలు వరదరాజులరెడ్డి, కొండారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి వరదరాజులరెడ్డి ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీ విజయం కోసం అందరినీ కలుపుకుని పనిచేస్తామన్నారు. టీడీపీలో ఎలాంటి గుంపులకు అవకాశం ఇవ్వబోమని అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ పార్టీని ముందుకు తీసుకెళతామన్నారు. త్వరలో చంద్రబాబు,లోకేష్‌ను కలిసివచ్చిన వెంటనే నేతలందరినీ, కార్యకర్తలను కలిసి వారందరినీ కలుపుకునే ప్రచారం మొదలెడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్‌చైర్మెన్‌ఆసం రఘురామిరెడ్డి, రమణారెడ్డి, మధుసూదనరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రవీణ్‌శ్రీకాంత్‌రెడ్డి, బచ్చు నాగార్జునరెడ్డి గురజాల చంద్ర, గండ్లూరు చంద్రదేవరెడ్డి, ఆవులు చంద్ర ఓబులరెడ్డి, సుబ్బారెడ్డి కొండారెడ్డి పాల్గొన్నారు.

వార్డు సభ్యుడితో పాటు పలువురు వైసీపీ నాయకులు చేరిక

దువ్వూరు (మైదుకూరు), మార్చి 15 : దువ్వూరు పంచాయతీ 8వ వార్డు సభ్యుడితో పాటు దాదాపు 65 వైసీపీ కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరాయి. 8వ వార్డు సభ్యుడు బొప్పెం చిన్నమాచయ్యతో పాటు వైసీపీకి చెందిన కృష్ణ కిషోర్, చిన్న ఓబన్న, సత్యనారాయణ, మునిస్వామి, దువ్వూరు మండలంలోని కృష్ణంపల్లెకు చెందిన షేక్ మహబూబ్ షరీఫ్, అబ్దుల్, మస్తాన్, జిలానీ, బాబా వలి, వరకుమార్, నరసింహులు తదితర మొత్తం 65 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్‌యాదవ్ కార్యాలయానికి చేరుకొని, ఆయనతో పార్టీ కండువా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు మండల టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి వెంకట రమణారెడ్డి, నాయకులు రమణ, రాంబాబు, సంజీవరెడ్డి, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

రేపు నూర్‌బాష దూదేకుల ఆత్మీయ సమావేశం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 15: నూర్‌బాష దూదేకుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు దూదేకుల సంఘం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకూరి నాగూర్ తెలిపారు. శుక్రవారం ఆత్మీయ సమావేశం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు కొరపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని, నియోజవర్గంలోని దూదేకుల సామాజిక వర్గం ప్రజలందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడాల దస్తగిరి, యువజన విభాగం పట్టణాధ్యక్షుడు రఫి, సుబాన్, కమాల్‌బాష, దస్తగిరి, ఫక్రుద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ విగ్రహ ప్రతిష్ఠ

ఖాజీపేట, మార్చి 15: మండల పరిధిలోని పత్తూరులో సీతారామ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండో రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు భక్తులకోసం కోలాటం నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు.శనివారం విగ్రహ ప్రతిష్ఠతోపాటు సీతారాముల కల్యాణం, గరుడ స్తంభం ఏర్పాటు చేయనున్నారు.

అనుమతులు లేని దిమ్మెల ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

బద్వేలు, మార్చి 15: మున్సిపాలిటీ అనుమతి లేకుండా భాకరాపేట చెరువును కబ్జా చేసి దిమ్మెల ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంతో పాటు చెరువులోని నీటిని అక్రమంగా వాడుకుంటున్న పొంగూరు నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు ఐలమ్మ కాలనీ సమీపంలోని చెన్నంపల్లె గ్రామపొలం సర్వేనెంబరు 1581 భాకరాపేట చెరువులో నాగరాజు ఆక్రమించుకుని సిమెంటు దిమ్మెల ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి చెరువు నీటిని వాడుకుంటున్నారన్నారు. దీంతో అక్కడి 300 కుటుంబాలకు పైగా నీరు అందకుండా పోతోందని, ఈవిషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

బద్వేలు, మార్చి 15: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి, వైవీయూ పాలక మండలి సభ్యులు చిన్నసుబ్బారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి సందర్శించారు. అనంతరం వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి 10వ తరగతి ఎంతో కీలకమైనదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు.

పోలీసు కవాతు



ముద్దనూరు మార్చి15: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ దస్తగిరి ఆధ్వర్యంలో నాలుగు రోడ్లకూడలి, పాత బస్టాండు,ప్రధాన రహదారుల్లో కవాతు చేపట్టారు.సీఐ దస్తగిరి మాట్లాడుతూ సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రశాంతంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భరోసా కల్పిస్తున్నామన్నారు.

వికలాంగుల భూ పోరాటం



భూ పోరాటానికి వెళ్తున్న వికలాంగులు

బద్వేలు, మార్చి 15: సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం దాదాపు 300 మంది వికలాంగులతో కలిసి భూ పోరాటం నిర్వహించారు. ఇందులో భాగంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ వికలాంగుల కు ప్రత్యేక కాలనీని ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి స్పందన లేకపోవడంతో భూ పోరాటం నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోరాటంలో భాగంగా వికలాంగులు గుడిసెలు వేసుకున్న చోట వారికి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, పట్టణ సమితి కార్యదర్శి బాలు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ, ఇమ్మానుయేల్, వికలాంగులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఓటర్ల అవగాహన సదస్సు

ఖాజీపేట, మార్చి 15: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా రిగ్గింగ్ కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడికక్కడ ఓటర్లకు అవగాహన నిర్వహించాలని చెబుతున్నా అందుకు విరుద్ధంగా ఖాజీపేటలో నిర్లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట ఉర్దూ పాఠశాలలో 194, 195, 196, 197 బూత్‌లలో 2019 ఎలక్షన్‌లో 60 శాతం మాత్రమే పోలింగ్ కావడంతో అక్కడ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించి ఓటర్లలో చైతన్యం తీసుకురావాలని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. దీంతో శుక్రవారం ఉర్దూ పాఠశాలలో ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ విశేషమేమిటంటే ఆ పోలింగ్ బూత్‌లలోని ఓటర్లకు సమాచారం ఇవ్వకపోగా తూతూ మంత్రంగా విద్యార్థులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచి అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతో ఇదేనా చైతన్యం తీసుకురావడమంటే ఇదేనా అని ఓటర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ సమావేశంలో ఇద్దరు మాత్రమే ఓటర్లు ఉండడం మరో విశేషం. ఏది ఏమైనా ఓటర్లను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

● **అవగాహన ర్యాలీ..:** ఓటుకు నోటు అసలే వద్దు, నీతి, నిజాయితీగా ఓటు వేద్దాం, మా ఓటు మీ భవిష్యత్తు అంటూ నినాదాలు చేస్తూ ఉర్దూ పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, తహసీల్దారు వెంకటలక్ష్మి, ఏవో నాగార్జున, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ

పోరుమామిళ్ల, మార్చి 15 : టీడీపీని ఆదరిచండని, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ ప్రచారం చేశారు. శుక్రవారం పోరుమామిళ్లలోని మూలవీధి తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హబీబు న్నీసా, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, ఎంపీటీసీ కల్వకూరి రమణ, మాజీ ఎంపీటీసీ శెట్టెం ప్రతాప్, సత్యరాజ్, రంతుల్లా, వెంకటక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వరదరాజులరెడ్డిని ఆశీర్వదించండి'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 15: ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని ఆశీర్వదించాలని నందమూరి యువసేవా అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వరదరాజులరెడ్డిని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంతో శుక్రవారం ఉదయం కామనూరులోని ఆయన స్వగృహంలో వరదరాజులరెడ్డి, కొండారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీబీఎన్ ఆర్మీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, కడప పార్లమెంటు ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున, తెలుగుయువత కడప పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, మచ్చా నాగభూషణం, చాంద్‌బాష, సురేష్ కుమార్, వెంకటేష్, ఇమామ్‌ఖాసీం, జనసేన నాయకులు జిలానీబాష తదితరులు పాల్గొన్నారు.

ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలి

పోరుమామిళ్ల, మార్చి 15 :బ్రహ్మంగసాగర్ నుండి ఎడమ కాల్వకు కొంత నీటిని విడుదల చేయాలని తెలుగుగంగ కార్యనిర్వాహక అధికారి బాలాజీరావు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పోరుమామిళ్ల చెరువులో నీరు అడుగంటి పోవడంతో వరికి నీరు అందేనా అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఆయన ప్రస్తుతం వరి పంట కీలక దశను దాటి రాక 10 నుంచి 20 రోజుల్లో పంట పూర్తి కాగలదని, పంటకు నీటి అవసరం తగ్గిందని ఇదే సమయంలో పోరుమామిళ్ల చెరువునందు నీరు అడుగంటిందన్నారు. ప్రస్తుతం పంటల కోసం ఎడమ కాల్వకు కొంత నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. నీరు విడుదల చేస్తే కొంత మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ



బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న శశిభూషణ్‌రెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 15 :మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్ కాలనీలో శుక్రవారం బీజేపీ జెండాను జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. ఇసుక, మద్యం మాఫియా, భూదందాలు విపరీతంగా పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే జయరాములు, ఆ పార్టీజిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, నియోజకవర్గ కన్వీనరు భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, బద్వేలు కో-కన్వీనరు పండరి, మనోహర్‌రెడ్డి, రమణాచారి, గురుశేఖర్, జిల్లా ప్రధాన కార్యద ర్శి షకీలాబేగం, నాగేంద్ర, రామక్రిష్టారెడ్డి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ కార్యాలయం ప్రారంభించారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సన్నద్ధం కావాలి



పోలీసులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

బద్వేలు టౌన్, మార్చి 15 : రానున్న సార్వత్రి ఎన్నికలకు పోలీసు అధికారులు, సిబ్బంది సర్వం సన్నద్ధం కావాలని ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశించారు. శుక్రవారం బద్వేలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏడు మండలాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళికపై దిశ నిర్దేశం చేశారు. సమస్యాత్మకపోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేకనిఘా ఉంచాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరించా లన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, సెక్టారు పోలీసు ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్ ఎలక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకస్మికంగా ఉపాధి హామీ పనులు తనిఖీ



పండ్ల తోటలను పరిశీలిస్తున్న పీడీ

ఖాజీపేట, మార్చి 15: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ యధుభూషణ్‌రెడ్డి ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీలోని ఫారెస్టు రోడ్డులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడంతోపాటు పండ్ల తోట పెంపకం రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం ఆరు గంటలకు వచ్చి 11 గంటలకు ఇంటికి వెళ్లేలా చూడాలని, కూలీల వెంట తాగునీరు తెచ్చుకునేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓఆర్ఎస్ ప్యాకెట్లు తెచ్చి కూలీలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, ఏపీవో చంద్రశేఖర్, టీఏలు సుబ్బారావు, గురుబాబు, ఈసీ రాధాకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థి ఎవరు అయినా గెలుపునకు కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న విజయమ్మ

బద్వేలు టౌన్, మార్చి 15 : పొత్తులో భాగంగా బద్వేలులో ఎవరికి కేటాయించినా అభ్యర్థి ఎవరైనా గెలుపునకు కృషి చేయాలని టీడీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయా మండల నాయకులతో మున్సిపాలిటీ మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బద్వేలులో టీడీపీ అభ్యర్థిగా రోశన్నను ఎన్నుకుని నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారని, నేడు బద్వేలు స్థానం బీజేపీకి కేటాయిస్తారనే విషయంపై చంద్రబాబుతో చర్చించడం జరిగిందన్నారు. ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా టీడీపీ కార్యకర్తలు, నాయకులు చంద్రబాబును అధికరంలోకి తెచ్చేందుకు కృషి చేయాల న్నారు. మండల పార్టీ నాయకులు బూత్ కన్వీనర్లు అయోమయానికి గురి కావద్దని మీకు అండగా టీడీపీ, నేను, రితీష్‌రెడ్డి అండగా ఉంటామని ఆమె అన్నారు. కార్యక్రమంలో అన్నిమండలాల టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలాలను ప్రభుత్వ అనుమతిలేకుండా లీజులకు ఎలా ఇస్తారు

కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించిన వైసీపీ అసమ్మతి కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 15 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన కోట్ల విలువైన స్థలాలను ప్రభుత్వ అనుమతి లేకుండా కేవళం కౌన్సిల్ తీర్మాణాలతో లీజులకు ఎలా ఇస్తారని వైసీపీ అసమ్మతి కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈసభలో మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో వాకర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అక్కడ కనీసం మంచినీటి సౌకర్యం కూడా మున్సిపాలిటీ ఏర్పాటు చేయడం లేదని వాకర్స్ ఆరోపిస్తున్నారన్నారు. జిమ్ కేంద్రాల మెయింటనెన్స్ లేక అవి ఘోరంగా వున్నాయన్నారు, మ్యాట్‌లేవన్నారు. జిమ్ కేంద్రాల చుట్టూ మెస్ పోయిందన్నారు. గేట్లు కూడా తొలగించడంతో మందుబాబులు అక్కడ ఆవాసాలుగా మార్చుకున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా 15 లక్షలతో మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపునకు ఆమోదం తెలిపారు. రోడ్లపై బీటీ ప్యాచ్‌లకు 8 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. నగరదీపికలకు 9వేలనుంచి 12 జీతం పెంచాలని, మున్సిపల్ వర్కర్స్‌కు జీతాలు పెంచాలని తీర్మానం చేశారు. రాబోయే సార్వత్రికల ఎన్నికల ను దృష్టిలో పెట్టుకోని ఈ జీతాల పెంపునకు ఆమోదం తెలిపినట్లు పలువురు భావిసున్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ సదస్సు

పోరుమామిళ్ల, మార్చి 15 :స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట్రావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సహకారంతో సుస్థిరాభివృద్ధి కోసం హోలిస్టిక్ శాస్త్రాల నవీకరణ అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈసదస్సుకు వెంకటేశ్వర విశ్వవద్యాలయం ప్రొఫెసరు రత్నాకరన్, యోగివేమన విశ్వవిద్యాలయ ప్రొఫెసరు శంకరన్ పాల్గొని విద్యార్థులకు పరిశోధకులనుద్దేశించి హోలిస్టిక్ శాస్త్రాల ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కోకన్వీనరు మధుబాబు, అధ్యాపకులు సులోచన శ్రీధర్‌మూర్తి, శివారెడ్డి, బాబు, రవిచంద్ర పాల్గొన్నారు. కాగా ఎంపీటీసీ కల్వకూరి వెంకటరమణ, అధ్యాపకులు వెంబడి ఈశ్వరయ్య, రవిచంద్ర, నరసింహారెడ్డిలను సత్కరించారు.

వేళకు బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్టాపు వద్ద తాడిపత్రి వెళ్లే బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

జమ్మలమడుగు, మార్చి 15: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి తాడిపత్రికి వెళ్లే బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. శుక్రవారం ఉదయాన్నే జమ్మలమడుగు మండలం, పట్టణంలోని పలు ప్రాంతాల ప్రయాణికులు బస్టాపు వద్దకు చేరుకున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 7.35 గంటలకు తాడిపత్రి వెళ్లే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. తాడిపత్రి సమీపంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బందికి ఫోన్లు చేసి కనుగొన్నారు. కొందరు ప్రయాణికులు ఆలస్యం కావడం, సర్వీసులు లేకపోవడం తాడిపత్రి రూటులో దాల్మియా, తలమంచిపట్నం, కొలిమిగుండ్ల ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఆటోలలో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు. కొందరు ఆ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు విధులకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ అయితే ఆర్టీసీ అధికారులు బస్టాపు వద్ద ప్రయాణికులను చూడకుండానే సర్వీసులను రద్దు చేయడం దారుణమని పలువురు వాపోయారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజును వివరణ కోరగా శుక్రవారం, మంగళవారం రోజులలో ప్రయాణికులు తక్కువగా ఉంటారని, సర్వీసులు రద్దు చేసినట్లు తెలిపారు.

రహదారి సౌకర్యం కల్పించండి

పోరుమామిళ్ల, మార్చి 15 : తమ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం వాహనాలు వచ్చి వెళ్లేందుకు వీలుగా రహదారి సౌకర్యం కల్పించాలని, అలాగే వ్యాపార సముదాయాల నిర్వహణకు కూడా రాకపోకల సౌకర్యం కల్పించాలని వెంకటేశ్వర హైస్కూలు కరస్పాండెంట్ పాండురంగారెడ్డి, పలువురు వ్యాపారులు డిమాండ్ చేశారు. పోరుమామిళ్లలో రోడ్డువిస్తరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివైడర్లకు వేసే కార్యక్రమం చేపట్టడంతో అక్కడు న్న వ్యాపారులు కొందరు స్కూలు నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. ప్రతిరోజూ 2వేల మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారని డివడర్ల మధ్యలో వాహనాలు వచ్చి వెళ్లేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. అక్కడ పనిచేసేవారు అభ్యంతరం తెలపడంతో వారు ఏఈ రెడ్డిగోవిందుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివైడర్ల మధ్యలో రాకపోకలకు వెసులుబాటుల కల్పించాలని ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అనవసరమైన చోట రాకపోకలకు డివైడర్ల మధ్యలో దారి వదిలారని పాఠశాల,వ్యాపార సముదాయాలకు వెళ్లే ప్రాంతాల్లో సౌకర్యం కల్పించమంటే ఆలోచిస్తున్నారన్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ రెడ్డిగోవిందును వివరణ కోరగా ప్రతి వంద కి.మీ డివైడర్ల మధ్య వాహనాల రాకపోకలకు స్థలం వదలాలంటే ఇబ్బదికరంగా ఉంటుందన్నారు.